జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

కులకచర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వాలీబాల్ క్రీడలకు ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. వికారాబాద్‌లో బుధవారం జరిగిన అండర్-14 విభాగంలో నిత్య, అంకిత, బృహదీశ్వర్, అభిరామ్, అండర్-17 విభాగంలో సంధ్య ఎంపికయ్యారు. గురువారం ఎంపికైన విద్యార్థులను పాఠశాలలో సన్మానించారు. శుక్రవారం వికారాబాద్‌లో జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారు.



వుడాతో అభివృద్ధికి బాటలు

తాండూరులో రెండు బల్దియాలు, 210జీపీలు
విజన్-2029 లక్ష్యంతో అడుగులు
నాలుగేళ్ల ప్రణాళికతో ప్రత్యేక నిధులు
మౌలిక సదుపాయల కల్పనే లక్ష్యం

8



ముగిసిన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు

మూడు రోజులు కొనసాగిన జాతర
చివరిరోజు పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

8



అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణానికి చర్యలు

పరిశీలించిన తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్
బీటీ లేని 4కి.మీల రోడ్డు కొలతల సేకరణ

7



ఘట్‌కేసర్‌లోని సర్వీస్ రోడ్డుపై మట్టికుప్పలు

సర్వీస్ రోడ్లు స్వాహా..

అస్తవ్యస్తంగా వరంగల్ హైవే

ఘట్‌కేసర్ పరిధిలోని వరంగల్ హైవే నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ముక్కుపిండి టోల్ వసూలు చేస్తున్నా.. నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. రోడ్డుపై వాహనదారులకు కనిపించాల్సిన సూచికబోర్డులు చెట్లకొమ్మల నడుమ దాగుడు మూతలు ఆడుతున్నాయి. సర్వీస్ రోడ్ల పరిస్థితి సరేసరి. ఇష్టారీతిన ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, ఎక్కడపడితే అక్కడ మట్టికుప్పలు పోయడంతో వాహనదారులు ఆ రోడ్డులో వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారు. ఎరిమల్లే వాగు పొంగితే వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇలా వరంగల్ హైవే అధ్వానంగా మారినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

- ఘట్‌కేసర్ పరిధిలో అన్నీ సమస్యలే
- చెట్ల కొమ్మల మధ్యన సూచిక బోర్డులు
- ఎరిమల్లేవాగు పొంగితే రాకపోకలు బంద్
- టోల్ వసూలు చేస్తున్నా.. పట్టని నిర్వహణ
- ఆందోళనలో వాహనదారులు, స్థానికులు
- పట్టించుకోని జాతీయ రహదారుల శాఖ



చెట్ల కొమ్మల నడుమ సూచిక బోర్డులు

ఘట్‌కేసర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వాహనదారుల భద్రతను జాతీయ రహదారుల శాఖ అధికారులు గాలికొదిలేశారు. ఘట్‌కేసర్ పరిధిలోని వరంగల్ జాతీయ రహదారి స్థలం యథేచ్ఛగా ఆక్రమలకు గురవుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఘట్‌కేసర్ నుంచి మాధవరెడ్డి రైల్వేవంతెన వరకు రోడ్డు ఇరుకుగా ఉండటంతో 2011లో బైపాస్ రోడ్డును నిర్మించారు. ఈరోడ్డుపై రాకపోకలు సాగించినందుకు టోల్ సైతం వసూలు చేస్తున్నారు. నాలుగు లైన్ల రోడ్డుతోపాటు ఇరువైపుల సర్వీసు రోడ్లను సైతం నిర్మించారు. కాగా, ఆ సర్వీస్ రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది బైపాస్ రోడ్డుకు ఇరువైపుల నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. కొన్ని చోట్ల మట్టి కుప్పలను రోడ్డుపై పోయడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే ఘట్‌కేసర్‌లోని ఎరిమల్లే వాగుపై నిర్మించిన సర్వీసు రోడ్డుతోనూ అవస్థలు తప్పడం లేదు. ఇక్కడ రోడ్డుఎత్తు తక్కువగా ఉండటంతో వాగు పొంగగితే ప్రవహిస్తే సర్వీసు రోడ్డునుంచి రాకపోకలు నిలిచిపోతున్నాయి. గతంలో కురిసిన వర్షాలకు సర్వీసు రోడ్డు రేలింగ్ పూర్తిగా దెబ్బతిన్నది. ఏళ్లు గడుస్తున్నా కనీస మరమ్మతులు కరువయ్యాయి.

కనిపించని సూచిక బోర్డులు

ఘట్‌కేసర్‌లోని హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో రోడ్డు మలుపులు, పలు రకాలు సూచిక బోర్డులు చెట్ల కొమ్మల్లో కలిసి పోయాయి. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే జాతీయ రహదారితోపాటు సర్వీసు రోడ్ల నిర్వహణ తీరుపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై రాకపోకలు

మిగతా 8వ పేజీలో...

జిల్లాలో నేడు

జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో రక్తదాన శిబిరం

వికారాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవాకం ఉదయం 6:30 నుంచి ఫారెస్ట్ ఆఫీస్ నుంచి హరిత రిసార్ట్స్ వరకు సైకిల్ ర్యాలీ, 3కే రన్ నిర్వహిస్తామని ఎస్పీ నారాయణరెడ్డి గురువారం తెలిపారు. ఉదయం 10:30 గంటలకు పోలీసు శిక్షణ కేంద్రంలో రక్తదాన శిబిరం ఉంటుందన్నారు. అలాగే వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం 6:30గంటలకు రాజీవ్‌నగర్ కాలనీ వైజంక్షన్ నుంచి అనంతగిరి రిసార్ట్స్ వరకు ఫన్ రన్ నిర్వహిస్తామని అసోసియేసన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, తన్వర్ అలీ తెలిపారు.



స్వాగతం పలుకుతున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

సీనియర్ సివిల్ జడ్జిగా వెంకటేశ్వర్లు

వికారాబాద్, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ సీనియర్ సివిల్ జడ్జిగా గురువారం వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. భద్రాద్రి జిల్లా నుంచి పదోన్నతిపై ఇక్కడికి వచ్చిన న్యాయమూర్తికి వికారాబాద్ బార్ అసోసియేషన్ సభ్యులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్ రెడ్డి, అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, జిల్లా న్యాయసేవాధిరాసంస్థ సెక్రటరీ న్యాయమూర్తి డీబీ శీతల్, ప్రిన్సిపాల్ జూనియర్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శృతి దూతా, న్యాయవాదులు వెంకటేశ్, కమాల్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, నారాయణ, శంకరయ్య, యాదవరెడ్డి, శుక్లవర్ధన్ రెడ్డి, రమేష్, నర్సిములు, తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.

పేరు ఉంది.. ఊరే లేదు!



గతంలో మాచనూరు గ్రామం ఉన్న ప్రాంతం

7

- వందల ఏళ్లుగా కనిపించని జనం
- దర్శనమిస్తున్న చారిత్రాత్మక సాక్ష్యాలు
- ఆ గ్రామం పేరుతో రెవెన్యూ భూములు
- తాండూరు మండలం 'మాచనూరుపై ప్రత్యేకం

జనం లేని ఊరేమిటని ఆశ్చర్యపోతున్నారా? అక్కడ ఊరు ఉండదు.. కానీ ఊరు ఉన్నట్లు సజీవ సాక్ష్యాలు కనిపిస్తాయి. రెవెన్యూ భూములు కూడా ఆ పల్లె పేరిటే కొనసాగుతున్నప్పటికీ జనం మాత్రం కనిపించరు. తాండూరు మండలం గోనూరు పంచాయతీ అనుబంధ గ్రామంగా ఉన్న మాచనూరుపై ప్రత్యేక కథనం.

తాండూరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి)

కాస్తులో ఉన్నవారికి పాస్‌పుస్తకాలు

- త్వరలోనే సర్వే చేయించి అందజేస్తాం
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కులకచర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాస్తులో ఉన్న రైతులందరికీ సర్వే చేయించి పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. గురువారం మండలంలోని అల్మాస్‌ఖాన్‌పేట్ రెవెన్యూ పరిధిలోని భూముల్లో కాస్తులో ఉన్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు. రెవెన్యూ పరిధిలో 1,056 ఎకరాల్లో ఘనపూర్, అంతారం, రుసుంపల్లి, పెద్దవార్వాల్, చిన్నవార్వాల్ గ్రామాల రైతులు కాస్తులో ఉన్నారు. వారందరూ మూడు తరాలుగా ఈ భూములను సాగు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. కానీ, వారికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వలేదు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవతో కలెక్టర్ రైతులతో సమావేశమయ్యారు. మొదటగా రెండు టీంలను ఏర్పాటు చేసి సాగు చేస్తున్న రైతుల భూముల్లో సర్వే చేయిస్తామని తెలిపారు. కాస్తులో ఉన్న ప్రకారం అందరికీ పట్టాపాస్ పుస్తకాలు జారీ చేస్తామన్నారు. ఇందుకు రైతులు అంగీకరించాలన్నారు. కోర్టులను ఆశ్రయిస్తే సమస్య పరిష్కారం కాదన్నారు. దీంతో రైతులందరూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలను పాటిస్తామని తెలిపారు. అలాగే చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్ గ్రామంలో అసైన్డ్ భూముల్లో కాస్తులో ఉన్న రైతులతో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. తమ ప్రభుత్వం రైతులను అన్నీ విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. ప్రతీ రైతుకు న్యాయం జరిగే విధంగా పాస్ పుస్తకాలు జారీ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర, సర్వే అధికారి రామ్‌రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, భరత్‌కుమార్, ఆంజనేయులు, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

పరిగి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ప్రతీక్‌జైన్ గురువారం సాయంత్రం పరిగి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. కులకచర్ల ,చౌడాపూర్ మండలాల్లో పర్యటనను ముగించుకుని తిరుగూ ప్రయాణంలో కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా భూములకు సంబంధించిన సమస్యల గురించి ఆరా తీశారు. రైతుల నుంచి వచ్చే దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేయాలని తహసీల్దార్ ఆనంద్‌రావుకు సూచించారు.

త్వరలో ఈఎస్ఐ సేవలు

తాండూరులో డిస్పెన్సరీ ఏర్పాటుకు చర్యలు

- ఇప్పటికే భవనాల పరిశీలన పూర్తి
- నిధుల్లో 87.5 శాతం కేంద్రం, 12.5 శాతం రాష్ట్ర వాటా
- 25 వేల మంది కార్మికులకు ప్రయోజనం



మున్సిపల్ కార్యాలయంలో గదులను పరిశీలిస్తున్న ఈఎస్ఐ అధికారులు (ఫైల్)

తాండూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా తాండూరు ప్రాంత కార్మికులు ఎదురు చూస్తున్న ఈఎస్ఐ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రాంతంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. 25 వేల మంది పైగా కార్మికులు ఉన్న తాండూరులో ఈఎస్ఐ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే డిస్పెన్సరీ మంజూరు చేసింది. ఇందుకోసం ఈఎస్ఐ కార్పొరేషన్ డైరెక్టర్ నాగేశ్, మహేష్ కుమార్, ఫైనాన్స్ డిప్యూటీ డైరెక్టర్ లాల్ సింగ్, డాక్టర్ కార్తీక్, ఇంజినీరింగ్ విభాగం జేఈ శంకరయ్యలు భవనాల పరిశీలించారు. గాంధీనగర్‌లోని షెడ్యూల్డ్ కులాల వసతి గృహం, పాత మున్సిపల్ కార్యాలయ భవనాలను పరిశీలిం చారు. పాత మున్సిపల్ కార్యాలయంలో వసతులకు అనుకూలంగా ఉందని అధికారుల బృందం నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఇక్కడ పార్కింగ్, గదులు, విద్యుత్, తాగునీటి సరఫరా వంటి సౌకర్యాలు ఉన్నందున డిస్పెన్సరీ కొనసాగించవచ్చునని అభిప్రాయపడ్డారు.

ఆరు పడకలు, ఇద్దరు డాక్టర్లు

ఈ డిస్పెన్సరీలో ఆరు పడకలను ఏర్పాటు చేస్తారు. ఇద్దరు డాక్టర్లతో పాటు హెడ్ నర్సులు, ఫార్మాసిస్టులు ఇతర సిబ్బంది కలిసి దాదాపు 20 మంది వరకు సిబ్బంది ఉంటారు. కాగా, భవన నిర్మాణానికి అనువైన స్థలం కేటాయిస్తే ఆస్పత్రి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం వాటాగా 87.5 శాతం రాష్ట్రం తన వాటాగా మిగిలిన 12.5 శాతం భరించాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటుకు 2016 సంవత్సరంలోనే భవనాలను కేటాయించాలని కోరింది. ప్రభుత్వం సరైన భవనాలను చూపకపోవడంతో దాదాపు ఎనిమిదేళ్ల పాటు పెండింగ్‌లో పడింది. స్థానిక కార్మిక సంఘాల నాయకులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఈఎస్ఐ కార్పొరేషన్ అధికారులతో ప్రత్యేకంగా చర్చించడంతో తాండూరులో డిస్పెన్సరీ ఏర్పాటుకు మార్గం సుగమం చేశారు.

బీరు సీసాలో బల్లి అవశేషం!



ధారూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తాగేందుకు కొన్న బీరు బాటిల్‌లో గుర్తుతెలియని అవశేషం కన్పించడంతో కొనుగోలుదారులు భయందోళనకు గురయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. ధారూరులోని ఓ వైన్ షాపులో గురువారం కొన్న బీరు సీసాలో ఏదో అవశేషం ఉందని సదరు వ్యక్తులు గుర్తించి ఫొటో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. కేరెల్లికి చెందిన లక్ష్మీకాంత్‌రెడ్డి, అనంతయ్య విందుకోసమని రూ.4వేల విలువైన వివిధ బ్రాండ్‌ల మద్యాన్ని కొనుగోలు చేశారు. ఓ కంపెనీ స్ట్రాంగ్ బీరు సీసాలో గుర్తుతెలియని అవశేషం కన్పించడంతో అవాక్కయ్యారు. బీరు బాటిల్‌లో ఉన్నది బల్లి అవశేషం అనుకొని భయాందోళనకు గురయ్యారు. బాటిల్‌ను ఓపెన్ చెయ్యకుండా వైన్ షాపునకు వెళ్లి యజమానిని ప్రశ్నించారు. తనకు సంబంధం లేదని షాప్ ఓనర్ దబాయించాడు. దీంతో లక్ష్మీకాంత్‌రెడ్డి బీరు బాటిల్ ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయగా అది వైరలైంది. ఇదిలా ఉంటే సదరు వైన్స్‌లో అమ్మింది కంపెనీ బీరేనా? లేక లేబుల్ వేసి నకిలీ బీర్లేమైనా అమ్ముతున్నారా? అని మద్యం కొనుగోలుదారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై మద్యం ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటివి జరగకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, పొరపాట్లు చేసే తయారీదారులు, పంపిణీదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కార్మిక పోరాటాలకు సిద్ధంకండి

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ పిలుపు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్

తాండూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కార్మిక పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ పిలుపునిచ్చారు. గురువారం తాండూరులో నిర్వహించిన వికారాబాద్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి హాజరై ప్రసంగించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ, సీసీఐ ఫ్యాక్టరీ కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలన్నీ అదానికి కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రంగంసిద్ధం చేసిందన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తే సహించం అని హెచ్చరించారు. ఏఐటీయూసీ నాయకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ తాండూరులో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు యూనియన్ ఆధ్వర్యంలో ఎన్నోసార్లు కేంద్ర మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు యేసు రత్నం, కార్యదర్శి జయపాల్, జిల్లా గౌరవాధ్యక్షుడు బాలశంకర్, జిల్లా కార్యదర్శి రవీందర్, కౌన్సిల్ సభ్యులు దశరథ్, దస్తప్ప, నర్సిములు, గోపాల్, మైసయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

కందుకూరు, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): పులిమామిడి జడ్పీ పాఠశాల విద్యార్థులు ముగ్గురు అండర్-17 జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 22న శంకర్‌పల్లి మండలం మోకిలో జరిగిన జిల్లాస్థాయి అండర్-17 వాలీబాల్ పోటీలు జరిగాయని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పి.స్వామి తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు కొర్ర రాహుల్, పి.తరుణ్, పి.కార్తీక్‌ల టీమ్ మొదటిబహుమతి సాధించిందన్నారు. వారు జిల్లా అండర్-17 వాలీబాల్ టీమ్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 25న రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల పోటీలను వికారాబాద్‌లో నిర్వహిస్తామని, తమ పాఠశాల విద్యార్థులు రంగారెడ్డి జిల్లా తరఫున పాల్గొంటారన్నారు. హెచ్‌ఎం బుచ్చయ్యగుప్తా, టీచర్లు శ్రీనివాసులు, స్టాన్లీ, జయంతి, శ్రీవిద్య, చెన్నయ్య, రాములు, రామారావు, ప్రసన్న, శిరీషలు పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని కోరారు.


పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీఈటీ స్వామి, ఉపాధ్యాయులు

కబ్జా నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలి


తహసీల్దార్ దత్తుకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

శంషాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ పరిధిలోని ప్రభుత్వ భూమి కబ్జాచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని ప్రజల ఆస్తిని పరిరక్షించాలని గురువారం రెవెన్యూ కార్యాలయం వద్ద బీజేపీ నియోజకవర్గ నాయకులు ఆందోళన చేశారు. రాష్ట్ర నాయకులు ప్రేంరాజ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. శంషాబాద్‌లోని సర్వే నంబర్ 6,261లో హెచ్‌ఎండీఏకు 360ఎకరాలు, దాని పక్కనే బాలాజీ వెంచర్‌కు సమీపంలో 5.15ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండతో నాలుగైదురోజులుగా ఆ స్థలంలోకి కొందరు ప్రవేశించి భూమిలోని రాళ్లను డిటోనేటర్లతో పగలగొట్టి చదును చేశారన్నారు. 'ఇది ప్రభుత్వ భూమి' అని పెట్టిన బోర్డును పీకేశారని చెప్పారు. కళ్లముందే కబ్జా చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కబ్జా నుంచి భూమిని కాపాడాలని తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. వెంటనే చర్యలు తీసుకోకుంటే ప్రజల ఆస్తి పరిరక్షణకు బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కాగా ఈ విషయమై స్పందిస్తూ 24 గంటల్లో చర్యలు తీసుకుంటామని, కబ్జాదారులపై పోలీసు కేసు పెడతామని నాయకులకు తహసీల్దార్ దత్తు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, మహిపాల్‌రెడ్డి, రాజు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ కబ్జాపై పోలీసు విచారణ


ప్రభుత్వ భూమిలో విచారణ చేస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ పట్టణం సర్వే నంబరు 262/1 ప్రభుత్వ భూమి కబ్జాపై పోలీసులు గురువారం విచారణ చేశారు. కబ్జాపై మూడు రోజుల క్రితం ఆర్ఐ కృష్ణ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై రాంచంద్రయ్య, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. రెవెన్యూ అధికారుల విచారణలో ప్రభుత్వ భూమి రియల్‌ఎస్టేట్ వ్యాపారి కేశవ్‌నాయుడు ఆధీనంలో ఉందని తేలిందని, అధికారుల ఫిర్యాదుతో పోలీసు చార్జీషీట్‌లో అతడి పేరు చేర్చుతామని సీఐ బాల్‌రాజ్ తెలిపారు. ప్రభుత్వ భూమి కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలోనే నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

శంషాబాద్‌లో పోలీసుల తనిఖీలు


వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లో గురువారం రాత్రి పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఏసీపీ కె.శ్రీనివాసరావు అధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. పాన్‌షాప్‌లు, ప్రార్థన మందిరాలు, బస్‌స్టాండ్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ- రెగ్యులర్ తనిఖీల్లో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. పాన్‌షాప్, కిరాణదుకాణాల్లో డ్రగ్స్ అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అందుకే విస్తృతంగా తనిఖీలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సీఐలు బాల్‌రాజ్, నరేందర్‌రెడ్డి, ఎస్సైలు రాంచంద్రయ్య, అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 35 మేకల మృతి



మేకల కళేబరాలు

షాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో 35మేక పిల్లలు మృతిచెందిన సంఘటన పోతుగల్‌లో గురువారం చోటుచేసుకుంది. మేకల కాపరి కార్ల శంకరయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామ సమీపంలో అతడు మేకల మంద పెట్టాడు. పెద్దమేకలను మేతకు తోలుకుపోయి, పిల్ల మేకలను మంద వద్దే తడకల్లో ఉంచాడు. మేత నుంచి వచ్చేసరికి 30 మేక పిల్లలు, 5 పెద్ద మేకలను వీధి కుక్కలు కరిచి చంపేశాయి. దీంతో శంకరయ్య లబోదిబోమన్నాడు. తనకు జీవనాధారమైన మేకల మృతితో నష్టం వచ్చిందని, అధికారులు ఆదుకోవాలని కోరాడు.

ఎర్రమట్టి లారీకి జరిమానా

సబ్ కలెక్టర్ ఆదేశాలతో విధించిన మైనింగ్ ఏడీ



రూ.37,393 జరిమానా చెల్లించినట్టు వచ్చిన రిసిప్ట్

తాండూరు రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అనుమతులు ఓ చోట.. డంపింగ్ మరో చోటకు తరలిస్తున్న ఎర్రమట్టి లారీకి సబ్‌కలెక్టర్ ఆదేశాలతో మైనింగ్ అధికారులు జరిమానా విధించారు. మైనింగ్ ఏడీ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. పెద్దేముల్ మండలం పాషాపూర్ శివారులో జరీనా మినరల్స్‌కు చెందిన ఎర్రమట్టి లారీ(టీఎస్34 టీబీ2421)ని తాండూరు మండలం మల్కాపూర్‌లోని ఐసీఎల్ ఫ్యాక్టరీకి తరలించాలి. కానీ బట్వారం మండలానికి తరలిస్తున్నారు. గురువారం తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ ఎర్రమట్టి లారీని తనిఖీ చేశారు. విశాఖకు తరలించే వే బిల్లుతో బంట్వారానికి లారీని తరలించడాన్ని గమనించారు. ఆయన ఆదేశాలతో మట్టి లారీకి రూ.37,393 జరిమానా విధించినట్లు ఏడీ తెలిపారు. వే బిల్లుల ప్రకారమే ఎర్రమట్టిని తరలించాలని సబ్‌కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే లీజు రద్దు, క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని జరీనా మినరల్స్‌కు అధికారులు హెచ్చరించారు.

అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణానికి చర్యలు



అటవీ భూమిలో బీటీ రోడ్డు పనులకు కొలతలు తీయిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

తాండూరు రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జినుగుర్తి-తట్టేపల్లి రోడ్డు మార్గంలో ఆగిన బీటీ రోడ్డు పనులను తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. తాండూరు మండలం జినుగుర్తి నుంచి అడ్కిచర్ల మీదుగా తట్టేపల్లి వరకు 2016లో ప్రభుత్వం నాబార్డు పథకం కింద బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టింది. జినుగుర్తి తండా నుంచి గుండ్ల మడుగుతండా వరకు అటవీ పరిధిలో ఉన్న 4కిలోమీటర్ల దూరంలో బీటీ రోడ్డు వేయకుండా గ్రావెల్ వేసి వదిలేశారు. దీంతో తట్టేపల్లి, అడ్కిచర్ల, గుండ్ల మడుగు తండా, మైసమ్మగడ్డతండా, ఉద్దండాపూర్, బాయిమీదితండా వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఈ రోడ్డు పనులపై ఫారెస్ట్ అధికారులతో సమీక్షించారు. తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, తహసీల్దార్ తారాసింగ్, రేంజర్ శ్రీదేవి సరస్వతిలతో కలిసి రోడ్డు స్థలాన్ని పరిశీలించారు. బీటీ ఎన్ని కిలోమీటర్లు వేయాలి? అనేదానిపై వివరాలు సేకరించారు. రోడ్డు కొలతలు తీశారు. అవసరమయ్యే నిధులపై ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్షించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అధికారుల వెంట అటవీ సెక్షన్ ఆఫీసర్ పీర్యానాయక్, ఆర్‌అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ లాలప్ప, ఆటవీశాఖ ప్రతినిధి మల్లయ్య, కార్యాలయ ప్రతినిధి మాణిక్‌రావు తదితరులు ఉన్నారు.

నీటి వనరుల సంరక్షణ సామాజిక బాధ్యత

ఏపీ మాజీ సీఎస్ జవహర్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న ఏపీ మాజీ సీఎస్ జవహర్‌రెడ్డి

కడ్తాల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):జీవ కోటికి ప్రాణాధారమైన నీటిని కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్‌రెడ్డి అన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లిలోని 'ది ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ ఎర్త్ క్లబ్, యంగ్ ఎర్త్ లీడర్స్ నాలుగో బ్యాచ్ అవగాహన కార్యక్రమం గురువారం ముగిసింది. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, అధ్యక్షురాలు కొర్పోలు లీలాలక్ష్మారెడ్డిల అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేఎస్.జవహర్‌రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్త కె.పురుషోత్తంరెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ కన్వీనర్ మాధవరెడ్డి, చైర్మన్ రవీందర్‌రావు, విద్యావేత్త ఉపేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఖమ్మం, నిజామాబాద్, మహబూబాబాద్ జిల్లాల 80 మంది వ్యాయామ ఉపాధ్యాయులు సదస్సులో పాల్గొన్నారు. శిక్షణ పొందిన పీఈటీలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. జవహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి, పర్యావరణం, జీవరాశుల పరిరక్షణకు మనందరం పాటుపడాలన్నారు. జీవ వైవిధ్యం దెబ్బతింటే మానవాళి మనుగడకే ప్రమాదమన్నారు. విద్యార్థులకు పర్యావరణ, జీవన విలువలు, నైపుణ్యాలపై అవగాహన కల్పించి భవిష్యత్తు పరిరక్షకులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, రాష్ట్ర కో-ఆర్డినేటర్ వై.వెంకటరెడ్డి, ప్రతినిధులు అనుదీప్, నగేశ్, శంకరయ్య లక్ష్మీప్రసన్న, హరిత తదితరులు పాల్గొన్నారు.

పేరు ఉంది.. ఊరే లేదు!

- వందల ఏళ్లుగా కనిపించని జనం
- దర్శనమిస్తున్న చారిత్రాత్మక సాక్ష్యాలు
- అయినా ఆ ఊరు పేరుతో రెవెన్యూ భూములు
- తాండూరు మండలం మాచనూరుపై ప్రత్యేకం



ఊరిలో ఉన్న పురాతన కాలం నాటి రావిచెట్టు



బీరప్పస్వామి ఏర్పాటు చేసుకున్న ఆశ్రమం

తాండూరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : తాండూరు మండలంలోని మాచనూరు లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా నుంచి బషీరాబాద్ వెళ్లే రోడ్డులో ఉంటుంది. వందలసంవత్సరాల క్రితం మాచనూరు గ్రామంగా ఉండేది. ఇది పూర్వ మంగా ఉండేదని పూర్వీకులు చెబుతుంటారు. కానీ, గ్రామం ఉందని చెప్ప డానికి ఆనవాళ్లుగా ఇక్కడ చాలానే గుర్తులు ఉన్నాయి. కోట గోడ, ఆంజనేయస్వామి దేవాలయం, పురాతనకాలం నాటి రావిచెట్టు, బురుజు

పురాతన కాలంలో మాచనూరు గ్రామంలో చాలా మంది జనాభా ఉండేదని పెద్దలు చెబుతుంటారు. అయితే గ్రామంలో దొంగల బెడదతో తీవ్రంగా ఇబ్బందులు పడిన జనం ఏం చేయాలో తెలియక ఊరు ఖాళీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం ఇక్కడ ఖాళీ చేసి గ్రామాన్ని వదిలి చుట్టు పక్కల ఉన్న గోనూరు, నారాయణపూర్, కాశీపూర్ గ్రామాలకు వెళ్లిపోయినట్లు కొందరు చెబుతున్నారు. కాగా, మాచనూరు రెవెన్యూ గ్రామం పేరిట గోనూరు గ్రామ భూములు 250 ఎకరాల్లో ఉన్నాయి. ప్రస్తుతం ఊర్లో జనం లేకపోయినా రికార్డుల్లో మాత్రం ఇప్పటికీ మాచనూరు పేరునే వ్యవసాయ భూములు రికార్డుల్లో కొనసాగుతున్నాయి.

ఊరు ఖాళీ అయిందిలా..

వంటివి సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి.

ఇక్కడ కొనసాగుతున్న ఆశ్రమం

కర్ణాటక రాష్ట్రానికి చెందిన బీరప్పస్వామి కొన్నేళ్ల క్రితం జనసంచారం లేని మాచనూరుకు వచ్చి ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ ఉన్న పురాతన కాలం నాటి రావిచెట్టు దగ్గర ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే బీరప్ప స్వామి లింగైక్యం(మరణించడం) పొందారు. దీంతో కర్ణాటక రాష్ట్రం చించోళి ప్రాంతానికి చెందిన శ్రీశ్రీ శివయోగి షీలింగస్వామి బీరప్పస్వామి ఇక్కడికి వచ్చి ఆశ్రమాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం జనంలేని ఆ ఊళ్లో ఈ ఆశ్రమం కొనసాగుతోంది.

ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న ఆశ్రమం



మాచనూరు గ్రామంలో జనం లేరు. ఇక్కడ బీరప్పస్వామి ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయన శివైక్యం చెందిన తర్వాత ఎనిమిదేళ్లుగా నేను ఆశ్రమాన్ని కొనసాగిస్తున్నాను. ఇక్కడ జనం లేకపోయినా ప్రతీ అది, మంగళవారాల్లో భక్తులు ఆశ్రమాన్ని సందర్శించేందుకు వస్తుంటారు. ఇక్కడ ఏర్పాట్లు సరిగ్గా లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. అయితే కొందరు చుట్టుపక్కల గ్రామస్తుల వారు మా ఆశ్రమానికి రోడ్డు వేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. - శివయోగి షీలింగ స్వామి బీరప్పస్వామి, మాచనూరు



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

జిల్లా అభివృద్ధికి స్పీకర్ కృషి

మర్పల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వెనకబడిన జిల్లాను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వుడా) ఏర్పాటుకు కృషిచేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ మేరకు మండల కాంగ్రెస్ నాయకులు గురువారం స్పీకర్‌ను కలుసుకొని సన్మానించారు. హైదరాబాద్‌కు దగ్గరలో ఉన్నా వికారాబాద్ జిల్లా అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. మొత్తం ఆ జిల్లాలోని అన్ని గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయన్నారు. ఆశోక్, సంజీవరెడ్డి, సుగ్రీవ్, ఈశ్వర్, రాజు, రాజశేఖర్ ధన్యవాదాలు తెలిపారు.

మహిళల అక్రమ రవాణా నిర్మూలనలో

అందరూ భాగస్వాములు కావాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో తులసి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు, మహిళల అక్రమ రవాణా నిర్మూలనకు సమాజంలోని అందరి భాగస్వామ్యం అవసరమని ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీవో తులసి, ఎంపీడీవో వెంకటమ్మ అన్నారు. జిల్లా శిశు సంక్షేమ శాఖ ఇబ్రహీంపట్నం ప్రాజెక్ట్, పజ్జల సంస్థల ఆధ్వర్యంలో మండల పరిషత్‌లో అంగన్‌వాడీ టీచర్లకు రెండురోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. వారు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న ప్రమాదకరం అంశం అన్నారు. ఎంతో మంది అమ్మాయిల జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. పేద, మధ్య తరగతి అమ్మాయిలు, మహిళలు ఈ నేరపూరిత చర్యలకు గురవుతున్నారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉద్యోగం, సినిమా చాన్సులు, ప్రేమ పెళ్లి పేరుతో మోసాలకు పాల్పడుతూ మానవ అక్రమ రవాణాలకు పాల్పడుతున్నారని ఆవేద వ్యక్తం చేశారు. దీనిపై సమాజంలో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా యుక్త వయస్సు బాలికలు, మహిళా సంఘాల సభ్యులకు వివరించాలన్నారు. ఫోన్ ఐడియోగంతో కలుగుతున్న నష్టాలపై కూడా పిల్లలకు తెలియజేయాలని అన్నారు. ప్రజ్వల సంస్థ స్టేట్ కో-ఆర్డినేటర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా తమ సంస్థ నిరంతరం కృషిచేస్తోందన్నారు. ఆన్‌లైన్ మోసాలపై డాక్యుమెంటరీ ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వల్లవి, సరళ, కల్పన, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పొదుపులో మహిళలదే ప్రధానపాత్ర



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సత్యనారాయణ

పెద్దేముల్, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): పొదుపు చేయడంలో మహిళలదే ప్రధానపాత్ర అని మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో గురువారం మండల మహిళా పరస్పర సహాయ సహకార పొదుపు సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన ప్రత్యేకాధికారి సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి లక్షల్లో రుణాలు అందజేస్తోందని తెలిపారు. ఏపీఎం బాలయ్య మాట్లాడుతూ మహిళా సంఘాలు అభివృద్ధి సాధిస్తుండడంతో బ్యాంకులు కూడా ఎలాంటి ష్యూరిటీలు లేకుండానే ఒక్కో గ్రూపునకు రూ.20లక్షల వరకు రుణాలను అందజేస్తున్నాయని తెలిపారు. పెద్దేముల్ మండలంలో మొత్తం 947సంఘాలు ఉండగా ఆ సంఘాలు పొదుపు చేసుకున్న డబ్బులు సుమారు రూ.10కోట్లు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జర్నప్ప, అండాలమ్మ, అక్షయ, పద్మమ్మ మంజుల పాల్గొన్నారు.

రిక్వెస్ట్ స్టాప్‌లో బస్సు నిలపాలని నిరసన



జీవన్గిలో బస్సును అడ్డగించి నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

బషీరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) రిక్వెస్ట్ బస్టాప్‌లో ఆర్టీసీ బస్సు నిలపాలని జీవన్గి గ్రామ బీసీ, ఎస్సీ కాలనీ వాసులు పలువురు గురువారం బస్సును అడ్డగించి నిరసన వ్యక్తం చేశారు. గతంలో గ్రామంలోని వాటర్ ట్యాంక్ వద్ద బస్సును ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవాలని కోరినా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి కాలనీవాసులు బర్వాల బస్టాప్ వరకు నడిచివెళ్లి బస్సు ఎక్కాలంటే వృద్ధులు, మహిళలు రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఈ విషయమై పలుమార్లు ఆర్టీసీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి రిక్వెస్ట్ బస్టాప్‌లో బస్సులను నిలిపేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో సదుపాయాల్లేవ్



కొనుగోలు కేంద్రం వద్ద రైతులు, నిర్వాహకులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

పటేన్‌చెరు రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మాదారం, ఎదులాబాదుల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. మాదారంలో ఈ నెల 7న కేంద్రాన్ని ప్రారంభించినా ఒక్క బస్తా కూడా కొనలేదన్నారు. దీన్ని బట్టే కొనుగోలు కేంద్రం ఎలా పనిచేస్తోందో తెలుస్తోందన్నారు. వ్యాపారులకు అమ్ముకునేందుకే రైతులు మొగ్గు చూపుతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించకపోవడం వల్లే రైతులు ప్రైవేట్‌గా వడ్లను అమ్ముకుంటున్నారని తెలిపారు. రైతులకు తాగడానికి నీరు, రాత్రి సమయాల్లో లైటింగ్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా వసతులను కల్పించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ జిల్లాల పోచిరెడ్డి, నల్లోళ్ల యాదగిరి, మశ్చేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీశైలం, కుమార్, మల్లేష్, లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పరిగి రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న నాగర్‌కర్నూల్ పీవీ. రావు సభా ప్రాంగణంలో నిర్వహించే మాలల ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బివెంకటయ్య, అంబేద్కర్ విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మత్తయ్య కోరారు. పరిగిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం సభకు సంబంధించి ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు నర్సింహులు, మాల మహానాడు నాయకులు వెంకటయ్య, ఎం.వెంకట్, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు



మాట్లాడుతున్న ఏపీవో శ్రీనివాస్

యాలాల, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్‌డీవో శ్రీనివాస్ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఏడాది కాలంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీవో శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా ఉపాధి పనుల విషయంలో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏడాది కాలంలో చెరువులు, కాల్వల పూడికతీత, రైతుల పొలాల్లో చేసిన ల్యాండ్ డెవలప్‌మెంట్ పనులపై ఆడిట్ చేశామన్నారు. ఉపాధి, రైతు కూలీలకు ఈ పథకం ద్వారా మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సరళ, ఏపీవో శ్రీనివాస్, ఏపీవో, ఎంపీడీవో పుష్పలీల, ఎంపీఈవో యాదయ్య, ఎస్ఆర్పీ రవి, ఏపీవో జనార్దన్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి



బహుమతులు అందజేస్తున్న హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు

పటేన్‌చెరు రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజ స్థాపనకు ప్రతీఒక్కరు కృషిచేయాలని అంకుశాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి తెలిపారు. అంకుశాపూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం హెచ్‌పీసీఎల్ సంస్థ ఆధ్వర్యంలో విజిలెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి క్విజ్ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు హెచ్‌పీసీఎల్ సంస్థ బహుమతులను ప్రదానం చేసింది. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ చేరిన అయ్యప్ప స్వాములు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బాసర నుంచి శబరిమలకు కాలినడక బయల్దేరిన 62 మంది అయ్యప్ప స్వాములు బుధవారం రాత్రి మేడ్చల్ చేరుకున్నారు. అయ్యప్పస్వాములకు రంజితరెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో పూజ, అల్పాహార ఏర్పాట్లు చేశారు.

సౌకర్యం ఉన్నా.. ప్రయోజనం సున్నా

- మేడ్చల్ ఆస్పత్రిలో తుప్పుపడుతున్న ఎక్స్‌రే యంత్రం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- తప్పక ప్రైవేట్‌లో ఎక్స్‌రే కోసం వెళ్తున్న పేదలు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రిలో లక్షలు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన ఎక్స్‌రే యంత్రానికి తుప్పుపట్టే పరిస్థితి నెలకొంది. పదేళ్ల క్రితం మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మారుస్తూ అందులో ప్రత్యేకంగా క్షయ వ్యాధిగ్రస్తులకు చికిత్స అందజేయాలన్న ఉద్దేశంతో క్షయ నివారణ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా ప్రత్యేకంగా రూ.10 లక్షలు వెచ్చించి అధునాతన ఎక్స్‌రే యంత్రాన్ని కొనుగోలు చేశారు. యంత్రం ఏర్పాటు చేసిన కొత్తలో పరీక్షలు నిర్వహించి రోగులకు వైద్య సేవలు అందించారు. రానురాను ఆ యంత్రంలో వాడే ఎక్స్‌రే ఫిల్మ్, ఫిల్మ్ డెవలప్ కోసం ఉపయోగించే రసాయనాలను సరఫరా చేయటం మానేశారు. దీంతో క్షయ వ్యాధిగ్రస్తులకు ఎక్స్‌రే తీసే వీలులేకుండా పోయింది. ఎప్పటిలా రోగులు బయట ప్రైవేట్‌లో పరీక్షలు చేయించి రిపోర్టు తీసుకొస్తే డాక్టర్లకు చూపించి చికిత్స చేస్తున్న పరిస్థితి. ఉన్నత అధికారులు ఎక్స్‌రే యంత్రం నిర్వహణను విస్మరించడంతో ఎనిమిదేళ్లుగా ఆ ఎక్స్‌రే యంత్రం మూలన పడింది. ఈ విషయమై స్థానికులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం పాపానపోవడం లేదు.



మేడ్చల్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్

ఇక దాతలే ఆదుకోవాలి

ఈ యంత్రం నిర్వహణ కోసం ఎవరైన దాతలు ముందుకు వచ్చి అవసరమైన సామగ్రిని ఆసుపత్రి నిర్వాహకులకు ఇప్పిస్తే యంత్రంతో నిరుపేదలకు ప్రయోజనం కలిగే వీలు లేక పోలేదు. యంత్రం ఆపరేట్ చేసే టెక్నీషియన్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నారు. యంత్రం నిర్వహణకు సంబంధించిన ఎక్స్‌రే ఫిల్మ్, ఫొటో డెవలప్ చేసే రసాయనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. సుమారు 100 ఎక్స్‌రేలు తీసేందుకు ఉపయోగ పడే ఎక్స్‌రే ఫిల్మ్‌లు , రసాయనాలకు రూ.6 వేల వరకు ఖర్చు అవుతుందని టెక్నీషియన్లు చెబుతున్నారు. ఆసుపత్రిలో నిరుపేదలకు ప్రతీ రోజు 5-10 ఎక్స్‌రేలు తీసినప్పటికీ నెలకు 200 ఎక్స్‌రేలు తీయ వచ్చు. అందుకు గాను ప్రతీ నెల కనీసం రూ.10-15వేలు ఖర్చు అవుతుంది. ఎవరైన దాతలు లేక స్థానిక పారిశ్రామిక వాడలోని పరిశ్రమల యజమానులు, సామాజిక సేవలందించే స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ఎక్స్‌రే యంత్రం నిర్వహణ బాధ్యత తీసుకుని సామగ్రి ఇప్పిస్తే ఈ యంత్రాన్ని వాడకంలోకి తీసుకొచ్చి నిరుపేదలకు వైద్య సేవలందించే వీలుకలుగుతుంది.

సామగ్రి అందుబాటులో లేకనే

ఎక్స్‌రే యంత్రం పాతమోడల్ కావడంతో యంత్రాన్ని వినియోగించడానికి ఉపయోగపడే పరికరాల ఇండెంట్‌ను ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని వైద్యులు అంటున్నారు. ప్రస్తుతం ఆధునిక డిజిటల్ యంత్రాలు వాడుతున్నందున పాత యంత్రానికి సంబంధించిన పరికరాల గురించి ఇండెంట్ పెట్టినా ఉన్నత అధికారులు పంపని పరిస్థితి నెలకొంది. గతంలో ఎక్స్‌రే సూచు యంత్రాన్ని వాడకంలో తీసుకువచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ ఎక్స్‌రే ఫిల్మ్ కడగగానికి ఉపయోగ పడే రసాయనాలను ప్రభుత్వం ద్వారా సరఫరా కాలేదని తర్వాత వేసిన ఫిలిం లేక వదిలేశామని ఓ వైద్యాధికారి తెలిపారు.



వృథాగా పడి ఉన్న ఎక్స్‌రే మిషన్

సర్వర్ సమస్య.. బ్యాంకు మూత!

ఇబ్బంది పడిన ఎస్బీఐ ఖాతాదారులు



బషీరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ ఎస్బీఐలో గురువారం మధ్యాహ్నం తర్వాత లావాదేవీలు స్తంభించడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు. ఇదేంటని బ్యాంకర్లను అడిగితే సర్వర్ సమస్య ఉందని చెప్పి బ్యాంకు పని మూసివేసినట్లు ఖాతాదారులు వాపోయారు. దీంతో ఖాతాదారులు పలువురు గంటల తరబడి బయట వేచిచూశారు. చేసేదిలేక ఖాతాదారులు ఉసూరుమంటూ ఇంటిబాట పట్టారు. ఎప్పుడోగాని ఇక్కడి బ్యాంకులో ఏదో ఒక సమస్య ఉత్పన్నమవుతుందని ఖాతాదారులు ఆరోపించారు.

ధారూరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా నిషాసింగ్



ధారూరు, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 24: ధారూరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా నిషాసింగ్‌ను నియమించారు. వైద్యుల కొత్త నియామకాల్లో భాగంగా ఇక్కడికి కేటాయించారు. కాగా ఇక్కడ పనిచేసిన డాక్టర్ సుష్మా సంగారెడ్డికి బదిలీపై వెళ్లారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆంజనేయులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు

కులకచర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులును ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఎంపిక చేశారు. కులకచర్లలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి నివాసంలో గురువారం కులకచర్ల, చౌడాపూర్ మండలాల కాంగ్రెస్ కార్యకర్తలతో అభిప్రాయం సేకరించారు. కార్యకర్తలందరూ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బీఎస్.ఆంజనేయులును ఏకగ్రీవం చేయగా ఎమ్మెల్యే ఈ మేరకు ప్రకటించారు. చౌడాపూర్ మండలానికి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌తో పాటు ఐదుగురు డైరెక్టర్‌లు నియమించనున్నట్లు తెలిపారు. వారం రోజుల్లో అధికారికంగా ప్రకటన వెలువడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, గోపాల్‌నాయక్, ఆనందం, భరత్‌కుమార్, రవినాయక్, శివరాంనాయక్ పాల్గొన్నారు.

వుడాతో అభివృద్ధికి బాటలు

- తాండూరులో రెండు మున్సిపాలిటీలు, 210 గ్రామ పంచాయతీలు
- విజన్-2029 లక్ష్యంతో అడుగులు
- నాలుగేళ్ల ప్రణాళికతో ప్రత్యేక నిధులు
- మౌలిక సదుపాయల కల్పనే లక్ష్యం



తాండూరు డివిజన్ మ్యాప్



తాండూరు, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): 2029 విజన్ లక్ష్యంగా అర్బన్ డెవప్‌మెంట్ (వుడా) ఏర్పాటైంది. రాబోయే నాలుగేళ్లలో పల్లెలు, పట్టణాల్లో కనీస మౌలిక సదుపాయల కల్పనే లక్ష్యంగా ఈ అథారిటీ పనిచేస్తుంది. స్వయం ప్రతిపత్తి కలిగిన ఈ అథారిటీకి ప్రత్యేక నిధులను కేటాయించనున్నారు. తాండూరు డివిజన్ పరిధిలో ఈ అథారిటీ పరిధిలోకి రెండు మున్సిపాలిటీలు, ఏడు మండలాల పరిధిలోని 210 గ్రామ పంచాయతీలను తీసుకున్నారు. ఇందులో పూర్తిగా వెనుకబడిన బషీరాబాద్, బొంరాస్‌పేట్, కోట్‌పల్లి మండలాలున్నాయి. ఈ మండలాలకు ప్రత్యేక నిధులిస్తే అభివృద్ధి పరుగులు తీసేందుకు అవకాశం ఉంటుంది.

మున్సిపాలిటీ, గ్రామాల వివరాలు

తాండూరు మున్సిపాలిటీలో 36, కొడంగల్ మున్సిపాలిటీలో 12వార్డులున్నాయి. తాండూరు మండలంలో 38, బషీరాబాద్ మండలంలో 31, యాలాల మండలంలో 33, కోట్‌పల్లి మండలంలో 18, పెద్దేముల్ మండలంలో 31, కొడంగల్ మండలంలో 17, బొంరాస్‌పేట్ మండలంలో 17, దౌల్తాబాద్ మండలంలో 25గ్రామాలు ఉన్నాయి. మున్సిపాలిటీలో పాలకవర్గాలు ఉండగా, గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది

చేపట్టే అంశాలు

పట్టణ స్థిరనివాసుల గృహ ఆవాసాలను తీర్చడం, అభివృద్ధి కార్యక్రమాలపై పెట్టుబడి (నిధుల కేటాయింపు), తాగునీటి, పారిశుధ్యం సమస్యల పరిష్కారం, మురికి వాడలపై ప్రత్యేక దృష్టి, భవిష్యత్తు లక్ష్యాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్, శాటిలైట్ టౌన్‌షిప్‌ల మాదిరిగా పట్టణాల అభివృద్ధి, పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం.

అనేక రకాల నిధులు

మాస్టర్ ప్లాన్, జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లకు అభివృద్ధి చేయడం, ప్రణాళికాబద్ధమైన వృద్ధిని సాధించటానికి ఉద్దేశించబడినది, హడ్కో ఆర్థిక సాయంతో పబ్లిక్ హౌసింగ్ ప్రోగ్రామ్ కింద తక్కువ, మధ్యస్థ ఆదాయ కుటుంబాల కోసం హౌజింగ్ డెవలప్‌మెంట్‌లు అభివృద్ధి చేస్తారు. రోడ్డు విస్తరణ కార్యక్రమాలు, కొత్త రహదారి నిర్మాణ ప్రాజెక్టులను పరిశీలిస్తారు. లేఅవుట్‌లలో మౌలిక సదుపాయల కల్పనకు చర్యలు తీసుకుంటారు. వినోదం, సౌకర్యాలు కల్పించడం, వివిధ ఆదాయ వర్గాల మధ్య గృహాలు, ప్లాట్ల పంపిణీ.

లక్ష్యాలు

పారదర్శకత స్థాయిని పెంచడం, నియమాల ప్రమాణీకరణ, ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ గణనలను స్థిరంగా ఉంచడం, సమయానికి అనుమతిని మంజూరు చేయడం, ఔటర్ రింగ్‌రోడ్ల ఏర్పాటు, కళాశాలలు, నైపుణ్య అభివృద్ధి కేంద్రాల ఏర్పాటు, విద్య వైద్య రంగాల్లో మెరుగైన సేవలు.

సర్వీస్ రోడ్లు స్వాహా..

(5వ పేజీ తరువాయి)

సాగించినందుకుగాను టోల్ చార్జీలు వసులు చేస్తున్నా కనీస నిర్వహణ పట్టదా అని ప్రశ్నిస్తున్నారు. ఎప్పటికప్పుడు చెట్ల కొమ్మలను తొలగిస్తూ వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారికి సర్వీసు రోడ్లకు మధ్యన మొక్కలను కుప్పలుకుప్పలుగా నాటించిన అధికారులు వాటి సంరక్షణను మరిచిపోయారు. ప్రధానంగా ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డులో ఎవరికి అవసరమైన చోట వారు మొక్కలను తొలగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.



చెట్లల్లో కూరుకుపోయిన బోర్డు

తరచూ ప్రమాదాలు



ఘట్‌కేసర్‌లోని బైపాస్ రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. ఎరిమల్లెవాగు వద్ద ఎత్తు తక్కువగా ఉండటంతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాగు వైపు రేలింగ్ కొట్టుకు పోయింది. ఇప్పటివరకు మరమ్మతులలు లేవు. టోల్ వసూలుపై ఉన్న శ్రద్ధ వాహనదారులకు సౌకర్యాలు కల్పించడంలో లేదు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి. **- మీసాల సుధాకర్‌రావు, ఘట్‌కేసర్**

అధికారులు చర్యలు చేపట్టాలి



హైవేకి ఇరువైపుల మొక్కల పెంపకం కోసం గత ప్రభుత్వం భారీగా హెచ్ఎండీఏ నిధులను ఖర్చు చేసింది. ఉపయోగపడే మొక్కలను కాకుండా త్వరగా పెరిగే సాధారణ మొక్కలను నాటారు. అవి ఏపుగా పెరిగితే కనీసం కొమ్మలను కూడా తొలగించడం లేదు. దాంతో సూచిక బోర్డులు కనిపించకుండా పోయాయి. అధికారులు స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలి. **- ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఘట్‌కేసర్**

తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



పరిగిలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న మారుతికిరణ్

తాండూరు, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.కిరణ్ కుమార్ కోరారు. ఆయన గురువారం తాండూరులో బీజేపీ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రమేష్ కుమార్, కృష్ణ ముదిరాజ్, అంతారం లలిత, సాహం, శ్రీలత, భద్రేశ్వర్, శ్రీకాంత్, దోమ కృష్ణ, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

కీసర రూరల్: కేంద్ర ప్రభుత్వ పనితీరుతో అభిమానులు బీజేపీ సభ్యత్వం పొందేందుకు ఉత్సాహం చూపుతున్నారని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం ప్రధాన రహదారిలో గురువారం ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పరిగి: బీజేపీలో సభ్యత్వం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని ఆ పార్టీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ భూనేటి అన్నారు. పరిగి మార్కెట్‌లో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి శివరాజు పాల్గొన్నారు.

ధారూరు: మండలంలోని రుద్రారం, అవుసుపల్లి గ్రామాల్లో గురువారం వికారాబాద్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వి.నందు పార్టీ కార్యకర్తలతో కలిసి పార్టీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజు నాయక్, అంజయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ చీఫ్‌విప్‌ను కలిసిన యాలాల మండల నాయకులు



మహేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న యాలాల మండల నాయకులు

యాలాల, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 24: రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డిని యాలాల మండల నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. యాలాల మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించారు. అందుకుగాను మహేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌ను ఆదేశించారు.

తిరుపతిరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



తిరుపతిరెడ్డితో కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డిని బొంరాస్‌పేట్ మండల కాంగ్రెస్ నాయకులు కలిశారు. హైదరాబాద్‌లో గురువారం తిరుపతిరెడ్డిని వారు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామినేటేడ్ పోస్టుల్లో బొంరాస్‌పేట్ మండలానికి సముచిత స్థానం కల్పించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, జయకృష్ణ, నర్సింహులుగౌడ్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు

పరిగి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. చివరి రోజున గురువారం భక్తులు భారీగా తరలివచ్చారు. నిత్యహోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ధర్మకర్తలు ఎదిరె పద్మ, కృష్ణ, జయశ్రీ, నరేందర్‌ల దంపతులు జరిపారు. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. సాయంత్రం స్వామికి ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, సురేందర్, బాబయ్య, ఆంజనేయులు, భాస్కర్, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి



స్థానికులతో చర్చిస్తున్న మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు ప్రతీ ఒక్కరు సహకరించాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం మున్సిపాలిటీలో ఇటీవల విలీనమైన గ్రామాల్లోని వివిధ కాలనీల్లో మార్నింగ్ వాక్ నిర్వహించారు. యువత నెలలో ఒక గంటపాటు శ్రమదానం కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా కాలనీల నాయకులు, స్థానికులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ఘట్‌కేసర్‌లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఆమె గురువారం తెల్లవారుజామున మున్సిపల్ పరిధిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరుపట్టికను పరిశీలించి ఎంత మంది వచ్చారు? ఎక్కడ పని చేస్తున్నారు? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు.గతంలో రెండు పర్యాయాలు జాతీయ స్థాయిలో క్లీన్‌సిటీ అవార్డులు సాధించడం సిబ్బంది గొప్పతనమేనని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

దోమ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని జిల్లా యువజన అధికారి ఐజయ్య అన్నారు. మండలంలోని మోత్కూర్, దిర్సంపల్లి, దోమ గ్రామ పంచాయతీ పరిధిలోని నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ప్రతీ ఆదివారం యువత స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొని గ్రామాలను శుభ్రపర్చడానికి ముందుకు రావాలని కోరారు. అనంతరం యువతీ యువకులకు మైభారత్ ఈవెంట్ డైరీ, టోపీలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హెచ్.మహేశ్‌బాబు, ఎంపీవో సోమలింగం, నెహ్రూ యువజన కేంద్రం అకౌంటెంట్ సాయి కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు హరినాథ్‌నెహ్రూ

మూడుచింతలపల్లి, , అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే మెడిసిటీ ఆస్పత్రి లక్ష్యమని వైద్యులు అన్నారు. మండలంలోని లక్ష్మాపూర్‌లో గురువారం మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో మెత్తం 128 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంజనేయులు,, వైద్యులు, పంచాయితీ కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.

వికారాబాద్: శ్రీ సత్యసాయి సేవా సమితి వికారాబాద్ వారి ఆధ్వర్యంలో మ్యాక్సీవిజన్ హాస్పిటల్ నేతృత్వంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంలోని సద్గురు సాయిరాం ఆస్పత్రిలో 95 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు సలహాలు చేశారు.

కొడంగల్: జిల్లా కలెక్టర్, అంధత్వ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, లయన్స్‌క్లబ్ కందూరి రాంరెడ్డి కంటి ఆస్పత్రి, కొడంగల్ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మురారి వశిష్ఠ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఆప్తాల్మిక్ వైద్యుడు హరినాథ్‌నెహ్రూ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముద్దప్పదేశ్‌ముఖ్, దాసప్పయాదవ్ పాల్గొన్నారు.



వికారాబాద్: కంటి పరీక్షలు నిర్వహిస్తున్న మ్యాక్సీవిజన్ ఆస్పత్రి వైద్యులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కులకచర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో హబీబ్ అహ్మద్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఎంఈవో హబీబ్ అహ్మద్ గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలో నిల్వ ఉన్న సరుకులను ఆయన పరిశీలించారు. సిబ్బంది, విద్యార్థులతో ఎంఈవో మాట్లాడారు. వ్రిద్యార్థులకు అందుబాటులో ఉంటూ ఉపాధ్యాయులు బోధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంఈవో

దోమ: దోమ మండలంలోని మోత్కూర్ ప్రాథమిక, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను దోమ ఎంఈవో వెంకట్ గురువారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో రిజిస్టర్లు పరిశీలించారు. విద్యార్థులకు ఆంగ్లం, గణిత శాస్త్ర బోధనపై ఉపాధ్యాయులతో అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు.

తిరుమలనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దఉమ్మెంతల్ తిరుమలనాథస్వామి ఆలయంలో బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతి కిరణ్ బూనేటి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, అనిల్, రాఘవేందర్ రెడ్డి, ఆంజనేయులు, ప్రకాష్, అజయ్‌కుమార్, నర్సింహులు, మహేష్ పాల్గొన్నారు

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

శామీర్‌పేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని శామీర్‌పేట మండల పశువైద్యాధికారి బిక్యా నాయక్ తెలిపారు. శామీర్‌పేట, బాబాగూడ, మజీద్‌పూర్ గ్రామాల్లో గురువారం పశువైద్య శిబిరాలను నిర్వహించి పశువులకు టీకాలు వేశారు. ఈ నెల 15 నుంచి వచ్చే నవంబర్ 25 వరకు పశువులకు టీకాలను వేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భాస్కర్, బస్వరాజ్, ఖాజామొయినుద్దీన్, జగదీశ్వరి పాల్గొన్నారు.



మజీద్‌పూర్‌లోగాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న వైద్యులు

క్రైం కార్నర్

భార్యను హతమార్చిన భర్త

- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు



సుజాత మృతదేహం

తాండూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భార్యను హతమార్చి భర్త పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన ఘటన తాండూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గురువారం రాత్రి జరిగిన సంఘటనతో తాండూరులో చర్చనీయంశమైంది. తాండూరు పట్టణం పాత తాండూరుకి చెందిన శ్రీకాంత్ గురువారం రాత్రి భార్య సుజాతను దారుణంగా హత్య చేశాడు. అనంతరం వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. ఈ హత్య ఎందుకు జరిగిందనే దానిపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు. తాండూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, పట్టణ సీఐ సంతోష్ కుమార్ పరిశీలించారు. సుజాతను తలపై కర్రతో బాది హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరికి ఆరేళ్ల కూతురు ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరికి గాయాలు

మూడుచింతలపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘట శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్వాల్ బొల్లారం ప్రాంతానికి చెందిన బ్రహ్మయ్య (44), నర్సింహులు బైక్‌పై నగరంలోని బొల్లారం నుంచి బాబాగూడ వైపు వస్తున్నారు. బాబాగూడ శివారు ప్రాంతంలో వాహనం అదుపు తప్పి స్తంభానికి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బ్రహ్మయ్యకు ఛాతి భాగంలో బలమైన గాయమైంది. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుంటలో జారిపడి వ్యక్తి గల్లంతు

కులకచర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కులకచర్ల గ్రామ సమీపంలోని కుంటలో జారిపడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. స్థానికుడు సత్యపాల్‌సింగ్ (30) గురువారం సాయంత్రం మేనఅల్లుడితో కుంట దగ్గరికి వెళ్లాడు. దుస్తులు అక్కడే వదిలి కుంటలో దిగుతున్న క్రమంలో జారి పడిపోయాడు. గమనించిన మేనల్లుడు కేకలు వేయగా చుట్టు పక్కల వారు వచ్చి పరిశీలించగా కనిపించలేదు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రాత్రి 7గంటల వరకు గాలింపు చేపట్టి చీకటి కావడంతో వెళ్లిపోయారు. గల్లంతైన వ్యక్తికి భార్య, ఐదు మంది పిల్లలతో అద్దె ఇంట్లో ఉంటూ పాత ఇనుప సామగ్రి సేకరించేవాడు.

కలప వాహనం పట్టివేత



పోలీసులు పట్టుకున్న కలప వాహనం

ధారూరు, అక్టోబరు (అంధ్రజ్యోతి) 24: అనుమతి పత్రాలు లేకుండా కలపను తరలిస్తున్న వాహనాన్ని గురువారం తెల్లవారుజామున పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. ధారూరు సమీపంలోని కోట్‌పల్లి క్రాస్ రోడ్డులో వెళ్తున్న డీసీఎం వాహనాన్ని బ్లూకోట్స్ పోలీసులు గురువారం తెల్లవారుజామున నిలిపి తనిఖీ చేయగా అందులో వేప కలప ఉన్నట్లు గుర్తించారు. ఈ కలప రవాణాకు సంబంధించిన అనుమతి పత్రాలను చూపించాలని బ్లూకోట్స్ సిబ్బంది డ్రైవర్ శ్రీనివాస్‌ను ప్రశ్నించగా పత్రాలు చూపించలేదు. దీంతో వాహనాన్ని పోలీస్‌స్టేషన్ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ట్యాంకర్‌లో చెలరేగిన మంటలు



లారీ కింద ఎగిసి పడుతున్న మంటలు

కీసర రూరల్, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే ఫ్యుయెల్ ఆయిల్(మండించే గుణం ఉన్న)లోడ్‌తో ఉన్న ట్యాంకర్ గచ్చిబౌలి నుంచి అవుటర్ రింగ్ రోడ్డు గుండా ప్రయణించి, చెర్లపల్లి పారిశ్రామిక వాడలోని ఓ కంపనీలో ఆ ఇంధనాన్ని ఖాళీ చేసింది. తిరుగు ప్రయాణంలో కీసర మండల పరిధి చీర్యాలలోని జయమోహన్ ఫంక్షన్ హాల్ సమీపంలోకి చేరుకుంది. ప్రయాణిస్తుండగానే లారీలోని డీజిల్ పైప్ పేలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన లారీ డ్రైవర్ కిందికి దిగి మంటలను ఆర్పే ప్రయత్నం చేశాడు. వాహనదారుల సాయంతో చాకచక్యంగా కార్బన్ డై ఆక్సైడ్ సిలిండర్‌ను వినియోగించి, నీటిని చల్లి, మందమైన దుప్పటితో ఎట్టకేలకు మంటలను ఆర్పారు. ట్యాంకర్ నిండుగా ఉందేమోనని, మంటలు ఉధృతంగా ఎగిసి పడితే పరిస్థితి ఏంటని ఎక్కడి వారు అక్కడే నిలిచిపోయారు. ఎగసిపడిన మంటలారిపోవటం, ఖాళీ ట్యాంకరేనని తెలియటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

చోరీలపై పోలీసుల సీరియస్

- గాలింపు చర్యలు ముమ్మరం

బషీరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్శ్యానాయక్‌తండాలో జరిగిన చోరీలను బషీరాబాద్ పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనివిధంగా గిరిజన తండాలోని మూడిళ్లలో దొంగలు చోరీలకు పాల్పడటం పోలీసులకు సవాల్‌గా మారింది. బషీరాబాద్ కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో అన్ని కోణాల్లో పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపడుతూ దొంగలను పట్టుకునే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఒకే వరుసగా మూడిళ్లలో చోరీలు జరగడంతో ఇది అంతరాష్ట్ర ముఠా కావొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలాఉండగా తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ గఫార్ ఆధ్వర్యంలో దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. కాగా క్లూస్ టీం పరిశీలనలో దొంగలకు సంబంధించిన కీలక ఆధారాలు కొన్ని లభ్యం కాగా పోలీసులకు వెల్లడించినట్లు తెలిసింది. ఏది ఏమైనా దొంగలను పట్టుకునేందుకు పోలీసు బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

మేడ్చల్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీ కేర్ ఎన్‌జీవో సంస్థ ప్రతినిదులు అన్నారు. గిర్మాపూర్ గ్రామంలో గురువారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎయిడ్స్ సోకకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.